క్లుప్తంగా

భోగితల్లి పేరిట భారీ బెలూన్ ఆవిష్కరణ



బెలూన్‌ను ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

సీతానగరం: మండలంలోని పెదభోగిలి గ్రామ దేవత భోగితల్లి అమ్మవారి చిహ్నంతో ఏర్పాటు చేసిన బెలూన్‌ను ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం ఆవిష్కరించారు. అమ్మవారి జాతర ఈ నెల 8,9,10 తేదీలలో జరగనున్న సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ అమ్మవారి జాతరకు లక్షలాదిమంది భక్తులు రానున్నారని తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అరవింద్ కుమార్, ఆర్యవైశ్య సంక్షేమ సఘం జిల్లా నాయకులు ఎం విశ్వేశ్వరరావు, ఏవీ సత్యనారాయణ, పిన్నింటి పైడిపునాయుడు, మరిసి వెంకటరమణ, పి.రామారావు, బి.శ్రీనివాసరావు, కొండలరావు పాల్గొన్నారు.

ఏపీమోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

మక్కువ: మండలంలోని ములక్కాయవలస గ్రామం సమీపంలో గల ఏపీమోడల్ స్కూల్‌లో ఆరవతరగతిలో ప్రవేశాలకు విద్యార్థులకు ఆహ్వానం పలుకుతున్నట్లు ప్రిన్సిపాల్ స్వర్ణలత శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 9వతేదీ నుంచి, 25వతేదీ వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వచ్చే నెల 11వతేదీన ఉదయం 10గంటలనుంచి 12గంటలకు వరకు పరీక్ష ఉంటుందని, ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నవజీవన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గర్భిణులకు భోజనాలు



గర్భిణులకు భోజనాలు వడ్డిస్తున్న నవజీవన్‌సేవాట్రస్ట్ సభ్యులు

సాలూరు/మక్కువ: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం నవజీవన్‌సేవాట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ కె.శ్రీధర్ ఆచార్య ఆధ్వర్యంలో గర్భిణులకు భోజనాలు అందించారు. ఆస్పత్రికి చేరుకున్న 80మంది గర్భిణులు, రోగులకు ఉచితంగా పోషకాహారం అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ శాంతి మాట్లాడుతూ ప్రతినెలలో శుక్రవారం గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నందున, ఆస్పత్రికి గర్భిణులు చేరుకుంటారన్నారు. వారందరికీ నవజీవన్‌సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా భోజనాలు అందించడం మంచి ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో హెడ్‌నర్స్ రత్నకుమారి, ఆస్పత్రి సిబ్బంది, నవజీవన్ మేనేజర్ సీహెచ్ చిన్నమ్మలు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీలో బంగారంపై రుణ సదుపాయం

సాలూరు/మక్కువ: పట్టణంలోని జిల్లాకేంద్ర సహకార బ్యాంక్‌లో శుక్రవారం నుంచి రైతులకు బంగారు ఆభరణాలపై రుణాలు అందించే సదుపాయం కల్పించనున్నట్లు జనరల్ మేనేజర్ చంద్రరావు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం బంగారు ఆభరణాలపై రుణాల మంజూరు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు, బ్యాంక్ వినియోగదారులకు అతి తక్కువ వడ్డీకి బంగారంపై రుణాలు అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. బ్రాంచ్ పరిధిలోని వినియోగదారులు లాకర్ సదుపాయం వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ సంతోష్‌కుమార్, ఏజీఎం శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

7న ప్రవేశ పరీక్ష

పార్వతీపురం: ఐటీడీఏ పరిధిలో 5వ తరగతిలో ప్రవేశానికి ఈనెల 7న ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు పీఓ సి.విష్ణుచరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ కులాలకు చెందిన విద్యార్థులు, 6వ తరగతినుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ ఖాళీలను భర్తీ చేసేందుకు గిరిజన అభ్యర్థులకు మాత్రమే ఆంగ్ల మాధ్యమంలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయని అభ్యర్థులు ఈనెల 7న ఏపీ గురుకులం పి.కోనవలస, ఏపీ గురుకులం కొమరాడ, ఏపీ గురుకులం భద్రగిరిలో బాలురకు ఏపీ గురుకులం కురుపాంలో బాలికలకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విక్రయానికి వరి విత్తనాలు సిద్ధం

సీతంపేట: స్థానిక వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో విక్రయానికి ఫౌండేషన్ వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని సీనియర్ సైంటిస్ట్ పి.సీతారాం ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. ఎంటీయూ- 1061, ఎంటీయూ-1064 రకాలు ఉన్నాయని, కిలో రూ.35 చొప్పున 25 కిలోల బస్తా ధర రూ.875గా నిర్ణయించడం జరిగిందన్నారు. విత్తనాలు కావాల్సిన వారు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల లోపు వచ్చి, కొనుగోలు చేసుకోవాలన్నారు.

సమావేశానికి అధికారుల డుమ్మా,,!

- హాజరుకాని వారిపై ఉన్నతాధికారులకు నివేదిక ఎమ్మెల్యే జోగారావు



సమావేశంలో అధికారులకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట:

మండల సర్వసభ్య సమావేశానికి హాజరుకాని అధికారులపై నివేదికలను తయారుచేసి ఉన్నతాధికారులకు పంపించాలని ఎంపీడీఓ భానుమూర్తికి ఎమ్మెల్యే జోగారావు సూచించారు. బలిజిపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నాగమణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి మండలస్థాయి అధికారులు హాజరై ప్రజాప్రతినిధులు చెప్పే సమస్యలపై స్పందించాల్సి ఉండగా అధికారులకు బదులు సిబ్బంది హాజరవడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్యే ఆశ్చర్యం వెలిబుచ్చారు. ఈ విషయమై పూర్తిస్థాయిలో స్పందించాలని ఎంపీడీఓ భానుమూర్తికి సూచించారు. ఈ సందర్భంగా వివిధ శాఖలకు సంబంధించిన సమీక్ష సమావేశం జరిగింది. బలిజిపేటలో నూతన ఐసీడీఎస్ ప్రాజెక్టు ఏర్పాటుచేసి బొబ్బిలి నుంచి కార్యకలాపాలు కొనసాగించడం ఏమిటని సమావేశానికి హాజరైన సూపర్‌వైజర్‌ను ఎమ్మెల్యే జోగారావు ప్రశ్నించారు. అన్ని కార్యకలాపాలు బలిజిపేట కార్యాలయం నుంచి నిర్వహించాలని సూచించారు. కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేస్తున్నారా? అని సిబ్బందిని ఎమ్మెల్యే ప్రశ్నించారు. చిన్నారులు, తల్లులకు పౌష్టికాహారం అందించే సమయంలో వైద్యశాఖ పర్యవేక్షించాలని సూచించారు. గౌరీపురం అంగన్వాడీ కార్యకర్త పోస్టును ఎస్టీకి ఎలా కేటాయించారని గ్రామంలో బీసీ కుటుంబాలు అత్యధికంగా ఉండగా మూడు ఇళ్లే ఉండే ఎస్టీలకు ఎలా కేటాయించారని ఎంపీటీసీ సాంబమూర్తి ప్రశ్నించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వనజాక్షి మాట్లాడుతూ క్లాస్ ప్రోగ్రాం మండలంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. కొత్తగా 10పంచాయతీలకు జలజీవన్ మిషన్ టెండర్లు పూర్తయ్యాయని ఆ ప్రకారం పనులు నిర్వహిస్తామన్నారు. వైద్యశాఖ అధికారులు మాట్లాడుతూ గ్రామాలలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. 14రకాల వైద్య పరీక్షలు, 64రకాల మందులు అందిస్తున్నామన్నారు. ఏఓ శ్రావణ్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ముందస్తుగా విత్తనాలు, ఎరువులు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. కౌలు రైతుల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నామని అర్హులుంటే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానుమూర్తి, ఎంపీపీ నాగమణి, మండల ఉపాధ్యక్షులు సాయిరాం, బి.హేమలత, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.



తుమరాడ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

రోడ్డు పనుల పరిశీలన

మండలంలోని పెదపెంకి ఆర్అండ్‌బీ రోడ్డు తుమరాడ జంక్షన్ నుంచి గ్రామంలోకి ఉన్న బీటీ రోడ్డు మరమ్మతు పనులను ఎమ్మెల్యే జోగారావు శుక్రవారం పరిశీలించారు. 1.4 కిలోమీటర్ల పొడవు కలిగిన రోడ్డుకు రూ.18.36లక్షల జిల్లా పరిషత్ నిధులతో మరమ్మతులు చేస్తున్నారు. పనుల నిర్వహణ ఏవిధంగా ఉందో పరిశీలించి త్వరగా పనులను పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. నాణ్యతలో లోపం ఉండకూడదని స్పష్టం చేశారు. ఈనెల 8,9,10తేదీలలో తుమరాడలో శ్రీశ్రీశ్రీ పాదాలమ్మ తల్లి గ్రామ దేవత ఉత్సవం ఉన్నందున పనులు త్వరగా పూర్తిచేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు



కాశీపేట కాలువల్లో పూడికలను తీయిస్తున్న కార్యదర్శి మురళి

సీతానగరం: అకాల వర్షాల కారణంగా మండలంలోని గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్త తొలగించే పనులను పెదభోగిలి, కాశీపేట సర్పంచ్‌లు జె. తేరేజమ్మ, టి ధనుంజయమ్మల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు ప్రారంభించారు. ఈ మేరకు శుక్రవారం ఉన్నతాధికారుల పర్యవేక్షణలో పెదభోగిలి-1,2 పంచాయతీ కార్యదర్శులు వెంకటరావు, సుధారాణి, జోగింపేట కార్యదర్శి కిరణ్, కాశీపేట కార్యదర్శి మురళి మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని ఈఓపీఆర్డీ కె.కుమార వర్మ ఇచ్చిన సూచలన మేరకు అమ్మవారి జాతర సందర్భంగా జోగింపేట, అప్పయ్యపేట, పెదభోగిలి, సీతానగరం గ్రామాలలో నాలుగు రోజులుగా, బీటీరోడ్ల మరమ్మతులు, పారిశుద్ధ్య పనులు నిర్వహించినట్లు చెప్పారు. అలాగే స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల ప్రజల అవవసరాలకు అనుగుణంగా తాగునీరు సరఫరా చేస్తామన్నారు. అలాగే కాశీపేటలో సర్పంచ్ టి.ధనుంజయమ్మ పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శి మురళి కాలువల్లో పూడికలు తీయించి పారిశుద్ధ్య పనులు నిర్వహించారు.

కొలతల ప్రకారం పనిచేస్తే గిట్టుబాటు వేతనం



మరిపివలసలో మస్తరు వెరిఫికేషన్ చేస్తున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: ప్రభుత్వం చెరువుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తూ ఉపాధి పనుల్లో పాల్గొనే వాందరికీ వేతనం గిట్టుబాటయ్యేలా పనులు నిర్వహిస్తోందని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు శుక్ర వారం మరిపివలస గ్రామంలోని ఎల్లంనాయుడు చెరువులో జరుగుతున్న ఉపాధిహామీ అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిగ్రామాన్ని ఆనుకుని ఉన్న చెరువులను ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా అభివృద్ధి చేయడానికి పనులు జరుగుతున్నాయన్నారు. ఉపాధి పనులు చేపట్టడానికి వాతావరణం అనుకూలించడం వల్ల గిట్టుబాటు వేతనం వచ్చేలా పనికల్పించాలని సూచించారు. వేతనదారులు సమయ పాలన పాటించి విధిగా సిబ్బందితో మస్తరు వెరిఫికేషన్ చేయించి కొలతల ప్రకారం పనులు చేయాలని సూచించారు. అప్పుడే వారికి వేతనం గిట్టుబాటవుతుందన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంటెంట్, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లోనే పూర్తి వైద్యసేవలు

- డీఐఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు



సిబ్బందితో మాట్లాడుతున్న డీఐఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు

పార్వతీపురంటౌన్: అన్ని రకాల రోగాలకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామాల్లోనే ప్రజలు చికిత్స పొందేలా చర్యలు చేపట్టాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సాయంత్రం కృష్ణపల్లిలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సందర్శించి నమోదు చేసిన రోగుల వివరాలను పరిశీలించారు. రికార్డులు పక్కాగా ఉండాలని ఈ సందర్భంగా ఆదేశించారు. వాతావరణంలో మార్పుల వల్ల సీజనల్‌గా వచ్చే వ్యాధులు, జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తించాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి తగ్గే వరకు వైద్య సిబ్బంది పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. అవసరమైన వారికి టెలిహబ్ ద్వారా స్పెషలిస్టు వైద్యులను సంప్రదించి తగు దిశానిర్దేశం చేయాలని కోరారు. అనంతరం శిబిరం వద్ద, 104 వాహనంలో మందులను, పరికరాలను పరిశీలించి వైద్య సిబ్బందికి వాటిపై ఉన్న పరిజ్ఞానం గురించి తెలుసుకున్నారు. రోగులు చెప్పే అనారోగ్య సమస్యలను పూర్తిగా విని తగు చికిత్స అందజేయాలని డీఐఓ జగన్‌మోహన్‌రావు వైద్యసిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సాహితి, సూపర్‌వైజర్ జయలక్ష్మి, జయగౌడ్, వైద్య సిబ్బంది నిర్మల, రాజేశ్వరి, 104 సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి

భామిని: విధి నిర్వహణలో సమయలపాలన తప్పనిసరిగా పాటించాలని సచివాలయ సిబ్బందికి డీఎల్‌డీఓ వి.గోపాలకృష్ణ సూచించారు. మండలంలోని బురుజోల, భామిని గ్రామ సచివాలయాలను శుక్రవారం సందర్శించిన ఆయన సిబ్బంది హాజరు, పనితీరు పరిశీలించారు. ప్రతిరోజూ సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించి, వినతులు స్వీకరించాలన్నారు. పీఎంజేఏ స్వై కార్డుల నమోదు పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గుర్ల కృష్ణారావు, ఏపీఓ తులసీదాస్ పాల్గొన్నారు.

విశాఖ వెళ్లి, పెన్షన్ అందజేత



విశాఖలో రాజేశ్వరమ్మకు పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ కార్తీక్

పాలకొండ రూరల్: అనారోగ్యం రీత్యా విశాఖపట్నంలో ఉంటున్న పట్టణ పరిధిలోని దేవరపేటకు చెందిన టేకి రాజేశ్వరమ్మకు వలంటీర్ కార్తీక్ శుక్రవారం ఆమె వద్దకు వెళ్లి, పెన్షన్ అందజేశారు. దీంతో ఆమె, ఆమె కుటుంబ సభ్యులు సదరు వలంటీర్‌ను అభినందించారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం



బాస్మతి జన్మనిచ్చిన బిడ్డతో అంబులెన్స్ సిబ్బంది

సీతంపేట: మండలంలోని పాండ్రఅక్కన్నగూడ గ్రామానికి చెందిన నిండు గర్భిణి సవర బాస్మతి 108 అంబులెన్స్‌లో శుక్రవారం ప్రసవించింది. ఉదయం ఆమెకు పురిటినొప్పులు రావడంతో వైద్యసేవల నిమిత్తం స్థానిక ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. కాన్పు కష్టతరం కావడంతో వైద్యుల సూచనల మేరకు శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. ఈ క్రమంలో ఆమెను అంబులెన్స్‌లో తరలిస్తుండగా, పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈఎంటీ రాము, పైలట్ మోహన్ సపర్యలు చేసి, పాలకొండ ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్య సిబ్బంది తెలిపారు.

ప్రజాశ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం



గడపగడపకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: ప్రజాశ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పార్వతీపురం మండలం బందలుప్పి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. సర్పంచ్ యాళ్ల ప్రమీల, ఎంపీపీ మజ్జి శోభారాణితో కలిసి గ్రామాన్ని సందర్శించి ప్రతి గడపకు వెళ్లారు. గడిచిన మూడేళ్లలో నవరత్నాల పేరిట జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. ఈ క్రమంలో ఆయా గ్రామంలో ప్రతి ఇంటికి అందించిన లబ్ధి గురించి క్షుణ్ణంగా తెలియజేశారు. అందుకు సంబంధించిన బుక్‌లెట్‌ను వారికి అందించారు. ఈ తరుణంలో గ్రామానికి సంబంధించి తాగునీరు. రహదారులు, డ్రైనేజీల సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసకువచ్చారు. వాటిపై సానుకూలంగా స్పందించిన ఆయన వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నాడు-నేడు ద్వారా అభివృద్ధి చెందిన ప్రభుత్వ పాఠశాలను, అంగన్వాడీ వైఎస్సార్ ప్రీస్కూల్‌ను సందర్శించారు. అక్కడి పిల్లలతో మమేకమయ్యారు. వారి విద్యా ప్రమాణాలను తెలుసుకునేందుకు పలు ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల ఆరోగ్య రక్షణలో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం, మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

కార్యక్రమంలో జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, వైస్ ఎంపీపీలు సిద్ధా జగన్నాథరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, ఆత్మ చైర్మన్ వై.తిరుపతి రావు, నాయకులు యాళ్ల శ్రీరాములు, జక్కు ప్రవీణ్, భీమవరం కృష్ణ, వై శ్రీరాములు నాయుడు, భూపతి రావు, తాన్న శ్రీరాములు, ఎంపీటీసీ సభ్యులు స్టేట్‌కార్పొరేషన్ డైరెక్టర్లు, ఏఎంసీ డైరెక్టర్లు ,కోఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు జేసీఎస్ కన్వీనర్, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు,

శతశాతం ప్రకృతి వ్యవసాయ మండలంగా తీర్చిదిద్దాలి

- ఏపీ సీఎన్ఎఫ్ రీజనల్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కృష్ణారావు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏపీ సీఎన్ఎఫ్ రీజనల్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కృష్ణారావు

గుమ్మలక్ష్మీపురం: మండలాన్ని శతశాతం ప్రకృతి వ్యవసాయ మండలంగా తీర్చిదిద్దాలని ఏపీ సీఎన్ఎఫ్ స్టేట్ రీజనల్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కృష్ణారావు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో డీపీఎం పి.షన్ముఖరాజు సమీక్ష సమావేశం నిర్వహించగా, సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేసి, ఆరోగ్యవంతమైన పంటలను సమాజానికి అందించాలని తెలిపారు. మండలంలోని 48 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తుండగా, మిగిలిన గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించేలా చూడాలని సూచించారు. అలాగే ప్రకృతి వ్యవసాయం వల్ల వచ్చే లాభాలను రైతులకు వివరించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ పద్ధతులకు సంబంధించి, రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో జట్టు ట్రస్టీ డి.పారినాయుడు, అడిషనల్ డీపీఎం ధనుంజయరావు, ఎమ్‌టీలు జి.నిర్మలాదేవి, బాలామణి పాల్గొన్నారు.

లోకోస్ యాప్ వినియోగంపై అవగాహన



వీఓలకు యాప్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న టీఓటీ బాలకృష్ణ

జియ్యమ్మవలస: స్థానిక వెలుగు కార్యాలయంలో లోకోస్ యాప్ వినియోగంపై వీఓఏలకు శుక్రవారం అవగాహన కల్పించారు. యాప్ డౌన్‌లోడ్, దాని వినియోగం, దానిలో పొందుపరచాల్సిన అంశాలు ఎలా పొందుపరచాలన్న అంశాలపై ఏపీఎం వెంకట్ శిక్షణ ఇచ్చారు. యాప్‌లో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉన్న మహిళా సంఘాల సభ్యుల వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. శిక్షణ పొందిన టీఓటీలు వీఓలకు దీనిపై శిక్షణ ఇస్తారు. గ్రామ స్థాయిలోని ఒక్కో వీఓఏ 30 సంఘాల నుంచి 60 సంఘాల లోపు సభ్యుల వివరాలు యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. 60 సంఘాలు దాటితే రెండుగా విడదీసి, ఇద్దరు వీఓలను కేటాయించి, సమాచారం సేకరిచాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీసీలు బాలకృష్ణ, పార్వతి, వీఓఏలు బాబూరావు, గౌతమి పాల్గొన్నారు.

నువ్వుపంటపై వర్షం దెబ్బ

గరుగుబిల్లి: వాతావరణంలోని మార్పుల కారణంగా కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని గరుగుబిల్లి, పెద్దూరు, ఉద్దవోలు, బీవీపురం గ్రామాల్లోని నువ్వుపంట దెబ్బతింది. సరిగ్గా పంటకు చేతికందే సమయంలో వర్షం తమను కష్టాల్లోకి నెట్టిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండబెట్టేందుకు పొలాల నుంచి రోడ్డు మీదకు తెచ్చుకున్న పంటంతా వర్షానికి బాగా తడిసిపోయిందని వాపోయారు. ప్రస్తుతం నెలకొన్న మబ్బు వాతావరణం మరో నాలుగు రోజుల పాటు కొనసాగితే తడిసిన పంట ఎండబెట్టుకునేందుకు అవకాశం ఉండదని, దీంతో పంట మొత్తం పూర్తిగా పోయే అవకాశం ఉందన్నారు.



ఉద్దవోలు బీటీ రోడ్డుపై తడిసిన నువ్వుపంటను ఆరబెడుతున్న రైతులు

వైభవంగా శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

వీరఘట్టం: మండలంలోని వండవ గ్రామంలో శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ ఐదో వార్షికోత్సవం పురస్కరించుకుని, శివపార్వతుల కల్యాణం శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి స్వామి వారి కల్యాణోత్సవం తిలకించి, ప్రత్యేక పూజలు చేశారు. ఏటా పంటలు బాగా పండి, అందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని వేడుకున్నారు. ఆమె వెంట ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, సర్పంచ్ మిడితాన కల్యాణి ఉన్నారు.

పైడితల్లి పండగకు రండి..!



ఎమ్మెల్యే కంబాల జోగులుకు పైడితల్లి మహోత్సవ ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

వీరఘట్టం: మండల కేంద్రంలో జరిగే పైడితల్లి పండగకు రావాలని కోరుతూ ఉత్సవ కమిటీ సభ్యులు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులకు శుక్రవారం ఆహ్వాన పత్రికలు అందజేశారు. దాదాపు ఏడేళ్ల తర్వాత జరిగే అమ్మవారి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని, ఈ వైభవాన్ని చూసి తరించాలని కోరారు. రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, కురుపాం ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి, పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు, మాజీ మంత్రి కళావెంకటరరావు, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి, పాలకొండ సబ్‌కలెక్టర్ నూరల్ కమర్‌కు ఆహ్వాన పత్రికలు అందజేసినట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

గిరిజన ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణానికి చర్యలు



వలగెడ్డలో ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

సీతంపేట: గిరిజన ప్రాంతాల్లో హిందూ ఆలయాల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి తెలిపారు. మండలంలోని వలగెడ్డ, మర్రిగూడ, పెదరామ గ్రామాల్లో కొత్తగా గ్రామదేవతల ఆలయాల నిర్మాణానికి శుక్రవారం ఆమె భూమిపూజ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ హిందూ ధర్మం కాపాడేలా ప్రభుత్వం పెద్దఎత్తున చర్యలు తీసుకుంటోందన్నారు. ఒక్క సీతంపేటలోనే దాదాపు రూ.10 కోట్ల వ్యయంతో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని అత్యంత వైభవంగా నిర్మించడం చాలా గొప్ప విషయమన్నారు. గిరిజనులంతా ఇక్కడే శుభకార్యాలు చేసుకునేలా కల్యాణ మండపం కూడా నిర్మించారన్నారు. ఈ అవకాశాన్ని గిరిజనులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, ఏఎంసీ చైర్మన్ హెచ్.మోహన్ రావు, సర్పంచ్‌లు హెచ్.ఆదిలక్ష్మి, తిరుపతిరావు, మౌనిక, పార్టీ నాయకులు ఎం.రామారావు, ఎస్.కాంతారావు, ఎస్.మహేశ్ తదితరులు పాల్గొన్నారు.